# దేహమే ఒక దేవాలయము!

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్

**ప్రేమస్వరూపులారా!**

పవిత్రమైన ప్రకృతియొక్క చిత్రములు విచిత్రమైనవి, పవిత్రమైనవి. ఇట్టి ప్రకృతియొక్క తత్త్వాన్ని మానవుడు అర్థము చేసుకోటం చాలాకష్టము. ప్రకృతియొక్క అనుగ్రహముపైననే మానవుని జన్మ మరియు జీవితము ఆధారపడి యున్నవి. కానీ యీ సత్యాన్ని విస్మరించి కేవలము తానే ప్రకృతికి నాథుడను అనే అహంకారముచేత విఱ్ఱవీగి తనయొక్క దివ్యత్వాన్ని తాను విస్మరిస్తున్నాడు. గ్రహించునది, అనుగ్రహించునది, నిగ్రహించునది, పరిగ్రహించునది అంతా ఈ ప్రకృతేననే సత్యాన్ని మానవుడు గుర్తించుకోలేకపోతున్నాడు.

**పరమాత్మ, ప్రకృతి రెండూ బింబ, ప్రతిబింబములు**

మానవ జీవితముపైన ప్రకృతియొక్క ఆధిపత్యము యెంతైనా వుంటున్నాది. ఈ సృష్టిలోని సమస్త పదార్థములుకూడను భగవంతునికి సమమే! ప్రపంచమునందుగల సమస్త వస్తువులుకూడను భగవత్ స్వరూపమే. ప్రకృతి-పరమాత్మలు వేరుగా భావించరాదు. ఈ రెండుకూడను బింబ ప్రతిబింబములే, అన్యోన్య ఆశ్రయములే, అవినాభావ సంబంధములే! మానవులకు ప్రధానమైన గురువు ప్రకృతియే! Nature is the best teacher. ఇలాంటి సత్యాన్ని మానవుడీనాడు గ్రహించుకోటంలేదు. ప్రకృతియందు ప్రతిపదార్థము, ప్రతివిషయము, ప్రతివ్యక్తికూడను అనేక విధములైన సందేశములందిస్తున్నవి. ఇట్టి పరమసత్యాన్ని గుర్తించి వర్తించినదే భారతదేశము. ఇదియే పవిత్రమైన భారతదేశ సంస్కృతికి ప్రధానమైన లక్షణము. రాయిమొదలు రత్నమువరకు, పచ్చికమొదలు పరంజ్యోతివరకు సామాన్యునినుండి మహనీయునివరకు, చీమమొదలు ఏనుగువరకు సర్వము భగవంతుని



sri sathyasai vachanamrutam

స్వరూపముగా విశ్వసించినది, భారతదేశము. ప్రతిపదార్థము పూజనీయమైనదిగా విశ్వసించినది, భారతదేశము. కనుకనే కఠినమైన శిలలనుకూడను ప్రతిష్ఠింపచేసి షోడశోపచార పూజలచే పూజించుచున్నది, భారతదేశము. తులసి, అశ్వత్థాది వృక్షములనుకూడను ఆరాధిస్తున్నది, భారతదేశము. గోవు, అశ్వము, గజము యిత్యాది మృగములనుకూడను ఆరాధిస్తున్నది, భారతదేశము. చీమలకు కూడను చక్కెరవేసి, పిండివేసి వానిని పోషించటానికి ప్రయత్నిస్తున్నది. కాకులు, గ్రద్దలు, కుక్కలు, కోతులు మొదలగు జంతువులు, పశుపక్ష్యాదులను కూడా భగవదారాధనకు యోగ్యమైనవిగా పరిగణించి వాటినికూడా గౌరవిస్తున్నది, భారతదేశము.

**భారతీయులయొక్క సామాజిక న్యాయము మరే దేశమునందు గోచరించదు**

ఈ పవిత్రమైన రహస్యమును గుర్తించుకోలేని మూర్ఖులు 'భారతీయులు మూఢవిశ్వాసు'లని భావిస్తున్నారు. కాదు, కాదు. భగవంతునియొక్క ప్రేమను మానవునివరకే పరిమితముగాకుండా సర్వప్రాణులకుకూడను పంచిపెట్టాలనే విశాలమైన భావముతో ఈ విధమైన ఆదర్శము నందిస్తోంది, భారతదేశము. ఇలాంటి భారతీయులయొక్క సామాజిక న్యాయాన్ని ఏ దేశమునందుకూడను మనము గుర్తించటానికి వీలుకాదు. ఈ తత్త్వజ్ఞానముయొక్క రహస్యాన్ని యే దేశముకూడను గ్రహించుకోలేదు. యిట్టి పవిత్రమైన, విశాలమైన దివ్యభావములతో కూడినది, ఈ భారతదేశము. కనుకనే ఉపనిషత్తులు కూడను 'అద్వేష్టా సర్వభూతానామ్' అనగా ఎవరిని ద్వేషించకూడదు అని బోధించాయి. "ఎవరిని విరోధము చేసినప్పటికిని భగవంతుని విరోధించినవాడవౌతావు. ఎవరిని ద్వేషించినా భగవంతుని ద్వేషించినట్లవుతుంది. ఎవరికి నమస్కారము చేసినప్పటికి వారియందుండిన అంతరాత్మస్వరూపుడైన పరమాత్మకే అందుతుంది" అని బోధించాయి. ఇట్టి పవిత్రమైన భారతీయ సంస్కృతిని గుర్తించుకోలేని మూఢులు దీనిని మూఢవిశ్వాసముగాను, మూర్ఖత్వముగాను పరిగణిస్తూ వస్తున్నారు. భారతీయులయొక్క పవిత్రత, నిస్వార్థము, దివ్యత్వములను యితరులు యెవ్వరూకూడను గ్రహించుకోలేరు. నిజానికి దివ్యమైన, పవిత్రమైన భారతీయ సంస్కృతిని భారతీయులే గ్రహించుకోలేకపోతున్నారు.

srisathyasai vahinamrutam

**ప్రకృతి అంతయు పరమాత్మయొక్క ప్రతిబింబమే!**

నామరూపములు వేరుగా వుండినప్పటికిని అందున్న ఆత్మతత్త్వము అనే సత్యాన్ని కూడను ప్రచారము చేస్తూ వచ్చింది, భారతదేశము. ఈ ప్రకృతి అంతయు పరమాత్ముని ప్రతిబింబమే! దీనియొక్క శాసనము వుల్లంఘించుటకు యెవరికి సాధ్యము కాదు, ఈ ప్రకృతియొక్క శాసనములను యెవరూ మీరటానికి వీలులేదు. యిట్టి నిత్యనిర్మలస్వరూపమైన దివ్యత్వాన్ని మానవుడు గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. తన తత్త్వాన్ని తాను గుర్తించుకొనే నిమిత్తమై వచ్చిన మానవుడు ఈ విషయాన్ని ఏమాత్రము విచారించక కేవలము వస్తువాహనాలపైనే, విషయ సంబంధములపైననే తాను దృష్టిని నిలుపుతున్నాడు. ఈ పాంచభౌతికమైన దేహము అనిత్యము, అసత్యమనే సత్యము గుర్తించుకోలేకపోతున్నాడు. మానవుని శరీరము మలమూత్ర దుర్గంధములతో కూడిన మలినపు కొంప. ఇలాంటి అనిత్యము, అశాశ్వతమైన దేహాన్ని ఆధారముగా చేసుకొని నిత్య సత్యమైన ఆత్మతత్త్వాన్ని మనము గుర్తించాలి. దేహమనేది కేవలము ఒక యినుపపెట్టె వంటిది. ఈ యినుపపెట్టెలో పెట్టిన ఆభరణములు మహా విలువైనవి. అందులో వుంచిన విలువైన ఆభరణములకు విలువనివ్వకుండా కేవలం యినుపపెట్టెనే ప్రధానమని విశ్వసిస్తున్నారు. సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తనలు, సచ్చింతన అనే విలువైన ఆభరణములు ఈ మలమూత్ర దుర్గంధ మాంసరక్తములతో కూడిన దేహమునందు భద్రపరుపబడినవి. ఈ విషయాన్నే తిరుత్తొండాళ్వారు చెప్పారు.

**మలినపు కొంప రోగముల ప్రగ్గెడు సేవకగంప జాతసం**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బులపొది లెమ్ము చూడ మనమెచ్చు దలంపగ దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే!**

మనిషి అనగా మనసే! కాని, మనిషి ఆకారాన్ని మాత్రమే ఆధారముగా చేసుకుంటున్నారు ఈనాడు. ఇది చాలా పొరపాటు. మనసు కలిగినవాడగుటచేతనే యితనికి 'మనిషి' అని పేరు వచ్చింది. ఈనాడు ప్రపంచము వుండవలసిన రీతిగా వుండటం లేదంటే దీనికి మూలకారణమేమిటి? మనస్సుయొక్క తత్త్వమును సరిగా గుర్తించుకొనలేకపోవటమే! మనిషి

srisathyasaivachanamrutam

అంటే మనసు. మనసు అంటే సంకల్పములయొక్క కూడిక. సంకల్పములనగా మన నిత్యజీవితములో మనము ఆచరించే ఆచారములే! నడతలు మంచిగా వుండినప్పుడే మనిషి మంచివాడౌతాడు. ఈనాడు లోకము మంచిగా లేదనుకుంటే నడతలు మంచిగా లేవని అర్థము. మన నడతలన్నీకూడను దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన నడతలుగా వుండాలి.

**మన కర్మలనుబట్టి ఫలములు వస్తూంటాయని గ్రహించాలి**

భగవంతుడనగా ప్రత్యేకము కాదు. 'దైవం మానుషరూపేణ.' దైవమునకు ప్రత్యేకమైన రూపము లేదు. ఇలాంటి మనుష్యరూపములో వచ్చిన దివ్యత్వాన్ని మానవత్వముగా భావించి కేవలము లోకసంబంధమైన విషయములలో ప్రవేశపెట్టటము మానవ జీవితానికి విరుద్ధమైన మార్గము. ఇలాంటి పవిత్రమైన దివ్యతత్త్వమును లోకానికి చాటే నిమిత్తమై అవతారములు అప్పుడప్పుడు వస్తూ వుంటాయి. నేను అనేక పర్యాయములు చెప్పాను. భగవంతుడు అవతరించటము కేవలము నీ సంసారము, నీ బాధలు, నీ కష్టములు, నీ దుఃఖములు, నీ విచారములను రూపుమాపి నీకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, సుఖాన్ని, సంతోషాన్ని ప్రసాదించే నిమిత్తము కాదు. ఇవన్నీ సహజసిద్ధముగా, కర్మఫలితముగా మనలను వెన్నాడుతూనే వుంటాయి. కనుకనే 'కర్మానుబంధీని మనుష్యలోకే' అన్నారు. యివి తప్పించటానికి వీలుకాదు. నీ action కు తగినట్టుగా reaction వుంటుంటాది. నీ కర్మలకు తగినట్టుగా ఫలితములు వుంటుంటాయి. ఒక నిలువుటద్దముముందు నీవు నిల్చుకొని ఆ ప్రతిబింబానికి నమస్కారము చేస్తే ఆ నిలువుటద్దములో వుండిన ప్రతిబింబము ఆ నమస్కారమును తిరిగి నీకే అందిస్తుంది. ఆ నిలువుటద్దములో వుండిన ప్రతిబింబాన్ని నీవుయేమైనా దండించి లేక ఏదైనా క్రూరముగా మాట్లాడినప్పుడు అదికూడను నిన్ను అదేవిధముగా దండించి, క్రూరముగా మాట్లాడుతుంది. మన కర్మలను బట్టి మన ప్రతిఫలములు వస్తుంటాయని మనము గుర్తించాలి. భారతీయులయొక్క ప్రధానమైన విశ్వాసములు మూడు. కర్మఫలము అనేది మొదటిది. మనము చేసిన దానిని తప్పించుకొనుటకు వీలుకాదు. దానిని అనుభవించాలి అనేది కర్మ సిద్ధాంతము.

**నిత్యా నిత్య పరిశీలనా శక్తి ఒక్క మానవునికి మాత్రమే ఉన్నది**

రెండవది అవతారతత్త్వము. మానవత్వము దైవమునుండి ఆవిర్భవించినదనేది ఒక

sri sathyasai vachanamrutam

సత్యము. మానవుడనగా కేవలము ఈ ఆకారముతో కూడినవాడు కాదు. మనుష్య జన్మ కేవలము దుర్లభమైనది. 'జంతూనాం నరజన్మ దుర్లభం.' దేనివల్ల దుర్లభం? పశుపక్షి మృగాదులవలే మనము తిరిగి, తిని, ఆనందించి సుఖనిద్రాదులతో భోగభాగ్యము లనుభవించినంత మాత్రమున మనముకూడను పశుపక్ష్యాదులవలే వుండవచ్చును కదా! యింక మానవుని విషయంలో ఇది దుర్లభమనటంలో అంతరార్థమేమిటి? నిత్యానిత్య విషయపరిశీలనా శక్తి ఒక్క మానవునికి మాత్రమే వుంటున్నాది. భూతభవిష్యద్వర్తమానములు గుర్తింపచేసే దివ్యశక్తికూడను ఒక్క మానవునికి మాత్రమే వుంటున్నాది. కనుక మానవత్వమును దుర్లభముగా భావిస్తూవచ్చారు. అయితే మానవుడు భవిష్యత్తును యోచించవచ్చును. గడచిపోయినదానిని చింతించవచ్చును. అలాగే వర్తమానంలో జరిగే దానిని అనుభవించవచ్చు. అయితే యిదికూడను మానవునికి విరుద్ధమైన మార్గమే! గడచినదానిని చింతించకూడదు. కారణమేమనగా గడచిపోయినది ఎంత చింతించినప్పటికి ఒక్క క్షణమైనా ముందుకు రాదు. భవిష్యత్తును విచారించనవసరము లేదు. కారణము, రేపటివరకు నీవు వుంటావనే గ్యారంటీ లేదు. ఇక భవిష్యత్తును గురించి యెందుకు విచారించాలి? రేపు అనుకుంటే యీనాడే మనము పోవచ్చును. అందువలన కేవలం వర్తమానాన్ని గుర్తులో వుంచుకోమని చెప్పింది. మనము వర్తమానమును present అంటున్నాము. కానీ, భగవత్ దృష్టిలో యిది సాధారణమైన present కాదు. ఇది omni present. ఎందువలన దీనిని omnipresent అన్నామంటే గడచిపోయినదాని result యీ presentలో వుంది. రాబోయేది కూడను ఈ presentలోనే వుంటున్నాది. మనము తిన్నది త్రేపు వస్తున్నాది యిప్పుడు. ఇప్పుడు తినబోయేది రేపటి దినము త్రేపు వస్తుంది. రాబోయే త్రేపుకు, వస్తున్న త్రేపుకు present ప్రధానము. గడచిపోయినది, రాబోయేది present లోనే వుంటున్నాది. అయితే అంత గాఢమైన, అంత దీర్ఘమైన ఆలోచన లేకపోవటంచేత మానవుడు past, present, future అనగా గడచిన దానిని, రాబోయేదానిని, వర్తమానాన్ని చింతిస్తూ వుంటాడు. ఈ భూత భవిష్యత్ వర్తమానములనేవి దైవత్వములో వుండవు, కేవలం మానవత్వమునకే!

sri sathyasai vachanamrutam

## మానవునికి ప్రేమతత్త్వమును బోధించటానికే అవతారములు వస్తాయి

ఒక చిన్న ఉదాహరణము. 'స్వామికి రాబోయేది తెలుసుకదా! తనకు ఈ bathroomలో పడిపోయేది తెలియదా?', అని కొంతమందికి ఆలోచన కలుగుతూ వుంటుంది. అయితే నాకు future తెలుసున్న మాట నిజమే! కానీ నేను యితరుల future ను గురించి యోచిస్తాను గాని, నా future నేను యెప్పుడూ యోచించను. ఈ సత్యాన్ని మీరు చక్కగా గుర్తించాలి. 'కర్తవ్యం యోగముచ్యతే' అని చెప్పబడినట్లుగా అప్పటి కర్తవ్యాన్ని అప్పటికి నేను చింతిస్తాను. ఇవన్నీ వస్తుంటాయి, పోతుంటాయి. ప్రతి ఒక్కటి ఈ జగత్తులోపల Passing cloudsయే! రావటం పోవటం, రావటం పోవటము ఈ మధ్యలోపల ఎన్నో రకములైన అనుభూతులు మానవునకు వస్తూంటాయి. ఈ విషయాన్ని మాత్రము మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. రామ, కృష్ణ, మత్స, కూర్మ, వరాహ యిలాంటి అవతారములయొక్క తాత్కాలికమైన ప్రయోజనములను మాత్రమే మీరు గుర్తిస్తూ వచ్చారుగానీ అవతారములన్నీ కూడను మానవునికి ప్రేమతత్త్వాన్ని నేర్పించే కోసమనే విషయాన్ని మీరు గుర్తించటం లేదు. నీకు ప్రేమ లేకపోవటంచేతనే, నీ స్వార్ధము పెరగటముచేతనే ఈ విధమైన బంధనకు జగత్తులో నీవు కట్టుబడి వుంటున్నావు. త్యాగము, ప్రేమ ఈ రెండు కలిగియున్నప్పుడే నీవు దివ్యమైన మానవునిగా రూపొందుతావు. త్యాగములేని మానవుడు కేవలము రోగమునందే నశిస్తాడు. ప్రేమలేని మానవుడు జీవించిన శవముగా రూపొందుతాడు. మానవునియొక్క దివ్యత్వము ప్రేమ, త్యాగములందు గోచరిస్తుంది. ప్రేమకు ప్రేమయే సరైన ఫలము. ప్రేమకు ప్రేమయే సాక్షి. ప్రేమకు భయము లేదు. కారణమేమనగా ప్రేమ పరిపూర్ణమైనదిగా వుంటుంది. ప్రేమలో స్వార్ధము లేదు. ప్రేమ, ప్రేమనిమిత్తమై వుండటంచేత ఫలము పూర్ణముగా వుంటుంది. కనుక, ప్రేమను నేర్పే నిమిత్తమై అవతారములు ఈ జగత్తునందు అవతరిస్తూ వుంటాయి.

## భగవంతుని దృష్టిలో చెడ్డ అనేదే లేదు

ఏకత్వములో వుండిన అనేకత్వమును జగత్తు చూస్తుండాది. కానీ, భగవంతుడు అనేకత్వములో వుండిన ఏకత్వాన్ని వీక్షింపచేస్తాడు. అదే unity in diversity. ఈ నిజమైన తత్త్వాన్ని భగవంతునిద్వారానే నేర్చుకొనుటకు సాధ్యమవుతుంది. కృష్ణావతారము కేవలము లీలామానుష విగ్రహమని భావిస్తూ వచ్చారు. భక్తులయొక్క పవిత్రమైన, నిశ్చలమైన, నిర్మలమైన,

srisathyasaivachanamrutam

నిస్వార్థమైన తత్త్వాన్ని జగత్తునకు ప్రకటింపచేయటానికి భగవంతుడు అవతరిస్తూ వుంటాడు. అందుకొరకు కొన్ని రకములైన కర్మల నాచరిస్తూ, దుర్మార్గులను హింసిస్తూ, సన్మార్గులను పోషిస్తూ అధర్మాన్ని నశింపచేస్తూ వస్తున్నాడని మనము భావిస్తున్నాము. అది నీ దృష్టిలో! ధర్మవుద్ధరణము, అధర్మనాశమని అనుకుంటున్నారు కాని, భగవంతుని దృష్టిలో చెడ్డ అనేదే లేదు. సర్వమూ తన సంకల్పమునుండి ఆవిర్భవించినదే! తన సంకల్పములు పవిత్రమైనవే కదా! ప్రతి పదార్థాన్ని, ప్రతివ్యక్తిని మనము ప్రేమించినప్పుడే భగవంతుని ప్రేమించినవారమౌతాము. ఎవరిని ద్వేషించినా మనము పరమాత్మను ద్వేషించిన వారమవుతాము.

**ఎప్పుడు ఏది జరిగినా అది భగవత్ప్రసాదముగానే భావించాలి**

భగవంతునియొక్క తత్త్వము భక్తులయొక్క భావముపైన ఆధారపడి వుంటుంది. భగవంతుని 'భగవంతుడా! నా బాధలు నీకు కన్పించటం లేదా? నా రోదన నీకు విన్పించటం లేదా? నా తత్త్వమును నీవు కంటితో చూడటం లేదా?' అని ఎవరు ప్రార్థిస్తూ వుంటారో వారికి భగవత్తత్త్వము అర్థము కాలేదనే చెప్పాలి. ఈనాటి సాధకునియొక్క పరిస్థితి ఏరీతిగా వుందంటే ధ్యానాది సమయములందు యోగరీతులుగా వుంటుంటారు. యోగులవలె ప్రకటిస్తారు. ఆ ధ్యాన సమయము సమాప్తి అయినదా తిరిగి నిత్యజీవితములో నిరంతరము వాడు భోగములలోనే మునిగివుంటాడు. ఇది కాదు, కృష్ణుడు చెప్పినది. 'సతతమ్ యోగినః' అన్నాడు. మనము తెల్లవారి యోగి, మధ్యాహ్నము భోగి, రాత్రి రోగి, ఈ విధముగా మారుతుంటే యింక 'సతతం యోగినః' యేరీతిగా కాగలము? సర్వకాల సర్వావస్థలయందు యేది చేసినా, యేది చూసినా, యేది చెప్పినా, యేది అనుభవించినా భగవద్భావంతోనే వుండాలి. కేవలము నీస్వార్థమునే దృష్టిలో ఉంచుకుని నీ కష్టములయందు భగవంతుని నిందించటము, సుఖసమయములందు భగవంతుని వర్ణించటము యిది సంకుచితమైన స్వభావము. ఇది విశాలమైన భావము కాదు. ఏ సమయమునకు, ఏ కాలములో ఎప్పుడు యేరీతిగా జరుగునో అది జరగకతప్పదు. ఏది జరిగినాకూడను భగవత్ప్రసాదముగానే మనము భావించాలి. అట్టి ప్రేమను మనము పెంచుకున్నప్పుడే నిజమైన ఆధ్యాత్మిక భావము మనలో ఆవిర్భవిస్తుంది. కేవలము లోకసంబంధమైన బాంధవ్యమును మాత్రమే మనము పెంచుకోరాదు. అంతర్ సంబంధమైన

srisathyasaivachanamrutam

ఆత్మతత్త్వమే నిజమైన శాశ్వత సంబంధము. "ఎక్కడికి వెళ్లినా, యేది చూచినా, భగవంతుని ఆనందమే నా ఆనందము. ఈ దేహము కేవలము పనిముట్టు. దీనిని నడిపించేది అనుభవింపచేసేది అంతా తనయొక్క దివ్యత్వమే," అని భావించాలి.

**స్వార్థమును త్యాగముచేసి, ఫలితమును విస్మరించి, భగవంతుని ఆనందమును చింతించేవారే పరమభక్తులు**

ఒకానొక సమయములో పరమభక్తులని విఱ్ఱవీగేవారిని పరీక్షింపగోరి లీలామానుష విగ్రహుడైన కృష్ణుడు ఒక చిన్న నాటకమాడుతూ వచ్చాడు. ఒకనాడు తాను కనీవిని యెరుగని బాధను అనుభవించినట్టుగా నటనచేశాడు. నా తలనొప్పి భరించటానికి వీలుకాలేదని ఒక పెద్దటవల్ గట్టిగా చుట్టి చాలా బాధపడినట్టుగా అనుభవిస్తూ వచ్చాడు. ముందు జరుగబోయే సంఘటనలను గుర్తించే ఈ విధముగా ప్రవర్తిస్తూ వచ్చాడు, కృష్ణుడు. రుక్మిణి, సత్యభామ, జాంబవతి ఇంకా చుట్టూ వున్న స్త్రీలంతా చేరారు. "స్వామీ! ఏనాడుకూడను మీరు ఈ విధంగా బాధపడడము చూడలేదు మేము. ఈ బాధయెందుకు వచ్చింది, దీనికి ఔషధము ఏమిటి?" అని ప్రశ్నిస్తూ వచ్చారు. వాళ్ళు అడుగుతున్నకొద్దీ కృష్ణుడుకూడా "భరించుకోలేను, షాక్‌కొట్టినట్లుగా వుంటున్నాది యిక తాళలేను", అని అనేకరకాలుగా తాను విలపించినట్లుగా ప్రకటిస్తూ వచ్చాడు. దీనికి నివారణమార్గమేమిటని వారు ప్రశ్నించారు. ఎవరైనా ఒక పరమభక్తునియొక్క పాదధూళిని తెచ్చి నా శిరస్సుపైన వేసినప్పుడు నా ఈ బాధ నివారణ అవుతుందన్నాడు. అదే సమయంలో నారదుడు అక్కడ ప్రవేశించాడు. సత్యభామ, రుక్మిణి, జాంబవతి నారదునివద్దకు వెళ్ళి "నారదా! నారదా! ఈ బాధను మేమేనాడు చూడలేదు. కృష్ణుని బాధను నివారించటానికి నీవేమైనా ప్రయత్నించ"మన్నారు. నారదుడుకూడను కృష్ణుని ప్రశ్నించాడు. కృష్ణుడు జవాబు చెప్పాడు "ఏ పరమభక్తుని పాదధూళియైనా నా శిరస్సుపైన వేసినప్పుడు ఈ బాధ నాకు తగ్గిపోతుంద"న్నాడు. నారదుడు వెంటనే "యింత పరమభక్తురాలైన సత్యభామ వుంటున్నాది కదా! ఆమె పాదధూళి యివ్వవచ్చును కదా!" అన్నాడు. సత్యభామ



sri sathyasai vachanamrutam

చేతులు నలుపుకుంది. "అయ్యో! నేను సతిని, కృష్ణుడు నా పతి. సతియొక్క పాదధూళి పతియొక్క శిరస్సుపైన వేయటము మహా అపరాధము. నరకప్రాప్తి లభిస్తుంది. నేను ఈ నరకమును అనుభవించలేను. నా పాదధూళి యివ్వను" అంది. రుక్మిణికూడను యిదే జవాబు చెప్పింది. ఇరవురు చేరి నారదుని పట్టుకున్నారు. "నీకంటె మహాభక్తులు లోకములో వుంటున్నారా స్వామీ? నీపాదధూళి యివ్వవచ్చుకదా", అన్నారు. నారదుడు చెప్పాడు "అమ్మా! క్షణములో వైకుంఠము చేరి మహావిష్ణువును సందర్శిస్తున్నాను. క్షణములో కైలాసము చేరి ఈశ్వరుని సందర్శిస్తున్నాను. క్షణములో స్వర్గముచేరి సర్వసుఖములు అనుభవిస్తున్నాను. గోవిందనామముచేతనే సర్వత్ర వ్యాపించి సర్వఆనందమును అనుభవిస్తున్నాను. అటువంటి నేను నా పాదధూళి కృష్ణుని శిరస్సుపైన వేస్తే నరకములోకి పోతాను. నాకీ ప్రాప్తి అంతా దూరమౌతుంది. నేను యివ్వను", అన్నాడు. 'భగవంతుని తలపైన భక్తుని పాదధూళి వేయటమా! యిది మహాపాపము!', ఇంతటి discrimination వున్నాది ఈ భక్తులలోపల. ఈ కృష్ణునియొక్క నాటకము మరింత అధికమైపోతున్నది. 'అబ్బబ్బ! నేను భరించుకోలేను', అంటున్నాడు, అరుస్తున్నాడు. నారదుడు అడిగాడు, 'దీనికి తగిన ఔషధము ఎక్కడవుందో చెబుతే పోయి తీసుకొని వస్తాన'న్నాడు. 'గోపికలయొక్క పాదధూళి తీసుకొనిరా! తప్పక నాకు నివారణ అవుతుంది' అన్నాడు. క్షణములో వెళ్లాడు గోకులము. 'గోవిందా! దామోదరా!' అని నామాన్ని స్మరిస్తూ పోయేటప్పటికి గోపికలందరు నారదుని కంఠస్వరము విని వెలుపలికి వచ్చారు. వచ్చి, 'మా గోపాలుడు ఎట్లావున్నాడు? ఎక్కడనుండి వస్తున్నారు? మధురనుండి వస్తున్నారా? గోపాలుడు బాగున్నాడా?' అని ప్రశ్నల వర్షం కురిపిస్తూ వచ్చారు. విచారముతో నారదుడు చెబుతున్నాడు 'గోపికలారా! కృష్ణుడు చాలా బాధతో వుంటున్నాడు. ఇంతకాలమైనప్పటికి కృష్ణుడు యేనాడు యింత బాధను అనుభవించటం నేను చూడలేదు. ఈ బాధ నివారణార్థమై ఔషధముకొరకు యిక్కడకు వచ్చాన'న్నాడు. గోపికలు విన్నారు. 'ఏమిటి? కృష్ణునికి శిరోభారమా? యింత నొప్పిగా వుంటున్నాదా? ఈ బాధ నివారణకు మా గోకులములో ఔషధము వుంటుండాదా, చెప్పండి. ఎక్కడవుందో మేము తీసి యిస్తాము', అన్నారు. 'మీ పాదధూళి కావాలిట', అన్నాడు నారదుడు. ఒక గోపిక యింటికి బయలుదేరింది. ఒక పెద్ద bed sheet తెచ్చింది. ఆ bed sheet పైన గోపికలందరు dance ఆడారు. ఆ పాదధూళి అంతా యింత పెద్దమూట కట్టి తక్షణమే

srisathyasaivachanamrutam

తీసుకొని వెళ్లమని చెప్పారు. 'నారదా! యింక ఆలస్యము చేయవద్దు, తక్షణమే తీసుకొనిపోయి మా కృష్ణునియొక్క బాధ నివారణ చేయమని' చెప్పి కోరారు. నారదునికి ఆశ్చర్యము వేసి 'వేదశాస్త్ర యితిహాస పురాణముల జ్ఞానములేని మూర్ఖులయొక్క స్వభావము యిట్లనే వుంటుంది. గోపికలు కేవలము మూర్ఖులు. గోపికలయొక్క పాదధూళిని కృష్ణునియొక్క శిరస్సుపైన వేయటానికి అంగీకరించారు. వీరికి నరకప్రాప్తి చేకూరుతుంది' అనుకున్నాడు. గోపికలకు చెప్పాడు, 'గోపికలారా! మీరు తెలివితక్కువ పని చేస్తున్నారు. మీరు నరకానికి పోతారు. ఈ విధముగా మీరు ధూళిని అందిస్తున్నారే' అన్నాడు. గోపికలు చెప్పారు, 'నారదా! నరకమునకు కాదు, యింకేవిధమైన లోకమునకు పోయినప్పటికి పరవాలేదు. మా కృష్ణుడు బాగుంటే మాకు అంతే చాలు' అన్నారు. 'నరకప్రాప్తో, స్వర్గప్రాప్తో మాకక్కరలేదు మాకృష్ణుడు బాగుండాలి. మా కృష్ణుడు క్షేమంగా వుండాలి' అని కోరారు, గోపికలు. ఎప్పుడు గోపికలు అక్కడ పాదధూళి యిచ్చారో అక్కడ కృష్ణుడు ఆనందముగా నవ్వుతూ కూర్చున్నాడు. నారదుడు అక్కడకు పోయి మూట విప్పేటప్పటికి కృష్ణుడు నవ్వుతున్నాడు. 'మందు వేయకమునుపే నివారణ అయిపోయిందే నీకు!' అని ఆశ్చర్యపోయాడు. "గోపికలు ఏ క్షణంలో తమ పాదధూళి యిచ్చారో ఆ క్షణమందే నా బాధ నివారణైంది", అన్నాడు. అప్పుడు కృష్ణుడు "స్వార్థమును త్యాగము చేసి, ఫలితమును విస్మరించి, భగవంతుని ఆనందమునే చింతించే గోపికలు పరమభక్తులు" అన్నాడు. "ఇది యిస్తే నాకేమి కష్టమో, యిది యిస్తే నాకేమి నష్టమో అనే స్వార్థము వారిలో లేదు. నేను సర్వజీవులయందు వున్నాను. ఆ పాదము నాదే, ఆ ధూళినాదే! అంతా నాదే!" అన్నాడు.

**నను కనుగొనగలరా**
**ఎనుబది నాలుగు లక్షల జీవులను**
**అనయమున యెడబాయ కుందునట**
**అణువు అఖండరూపుడై వెలయునట** ॥నను॥
**ఘనమగు దొంగలలో గజదొంగను**

నీ దృష్టిలో వాడు దొంగ అనుకుంటావు. నా దృష్టిలో వాడు నేనే! ఇలాంటి దివ్యత్వమును ప్రపంచమునకు ఏకత్వముగా చాటే నిమిత్తమై వచ్చినవి, ఈ అవతారములు.

sri sathyasai vahanamrutam

## ప్రేమయే దైవము, దైవమే ప్రేమ

దైవత్వము ఒక ప్రత్యేకమైన రూపములో వుంటున్నాదని భావించరాదు. ఐక్యత కావాలి. ఇది లేకుండా ఈనాడు జగత్తులో వుండిన సమస్యలు ఏవిధముగా కూడను నివారణ చేయటానికి వీలుకాదు. కనుక Unity ఐకమత్యము అత్యవసరము. ఐకమత్యమే జీవితముయొక్క సూత్రము. ఈ సూత్రమునందే దైవత్వముయొక్క ఆనందము కలిగి వుంటుండాది. ఆ Unity కలిగినప్పుడే ప్రతిమానవుని యందుకూడను purity నిర్మలత్వము ఏర్పడుతుంది. ఈ purityనే divinityగా మారిపోతుంది. ఈ ఏకత్వాన్ని అభివృద్ధి పరచేనిమిత్తమై ప్రేమతత్త్వము చాలా అవసరము. ప్రేమచేత యేమైనాకూడను మనము సాధించవచ్చు. ప్రేమయే దైవము. దైవమే ప్రేమ. ఒక చిన్న ఉదాహరణము. మీరు నమ్మవచ్చు, లేకపోవచ్చు. ఈ పదహైదు దినములుకూడను కాలు కదిలిస్తే ఒక పెద్ద shock వలే కలుగుతుంది. పొద్దున్న బయటకు వచ్చాను, అటూ యిటూ తిరిగాను. భక్తులను చూచేటప్పటికి ఆ ఆనందములో వారిప్రేమ ఈ ప్రేమగా ఈ ప్రేమ వారిప్రేమగా నా దేహాన్ని మరచిపోయాను. ప్రేమరహితమైన దీంట్లో యేమాత్రము ఆనందాన్ని మనము అనుభవించలేము. గోపికలు కూడను చెప్పారు.

**ప్రేమరహిత మరు భూములలో**
**ప్రేమాంకురములు పెంపొంద**
**ప్రేమావేశముతో**
**ప్రేమ సుధావర్షము వర్షింపగ**
**ప్రేమనదులు ప్రవహింపగ**
**మురళీగానము చేయగదే, మురళీగానము చేయగదే!**

"కృష్ణా! ఒక్కతూరి మురళి వాయించు. ఏ విధముగా అంటే ప్రేమరహిత మరుభూములలో, ఈ చవిటి భూములలో మా హృదయాలలోపల, ప్రేమాంకురములు పెంపొందింపజేయి. ఏ విధముగా నాటుతావు? ప్రేమావేశముతో-ప్రేమసుధావర్షము వర్షింపగ, ప్రేమనదులు ప్రవహింపగ, మురళిగానము చేయగదే. వర్షము ప్రేమనే, భూమి ప్రేమనే, మొక్కలు ప్రేమనే, నాటటము ప్రేమనే, ప్రవహించటము ప్రేమనే అంతా ప్రేమమయముగా వుండినప్పుడే మేము ప్రేమతత్త్వముతో విష్ణుత్వము పొందుతాము" అని ప్రార్థించారు, గోపికలు. అనగా, మనము



sri sathyasai vachanamrutam

ఏమి చేసినాకూడను సర్వము ప్రేమమయముగా వుంటుండాలి. ఒక పాత్రలో మనం పాయసము పోసిపెడితే ఎన్ని రంధ్రములు కొట్టినా అన్ని రంధ్రములలోంచి పాయసమే వస్తుందిగాని, పాయిజన్ రాదు కదా! కనుక, మన హృదయాన్ని ప్రేమమయముగా మార్చుకుంటే చేసేపనులు ప్రేమనే, చూచే చూపులు ప్రేమనే, వినే విషయములు ప్రేమనే! అంతా ప్రేమమయమైనట్టుగా వుంటుంది. ఏదో బాహ్యమైన వస్తువులు మనము మార్చటానికి ప్రయత్నిస్తున్నాముగాని అన్నింటికి ఆధారమైవున్న మన భావమును మనము మార్చుకోటానికి ప్రయత్నించటం లేదు. అన్నింటికి మూలము, కీలకమైనది యేదో దానిని మనము పట్టటానికి ప్రయత్నించాలి. ఒక రాజు తన రాజ్యములో ఏ ప్రదేశమునకు వెళ్లినా ముండ్లు లేకుండా చేయాలని అనేకమంది కూలీలను పెట్టి ముండ్లు ఏరిపించుతూ వచ్చాడుట. ఒక తెలివితేటలు కలిగిన మంత్రి చెప్పాడుట, "రాజా! ఈ విధమైన పనికి ధనము వ్యర్థము చేయటమెందుకు, ప్రజలను కష్టపెట్టుట మెందుకు? నీవు ఏ ప్రదేశమునకు వెళ్లినా కాళ్లకు చెప్పులు వేసుకుంటే ఏ ముళ్లువుంటే నీకేమి? ఎన్ని ముళ్లు వుండినా నడవవచ్చు. కనుక, నీ కాళ్లకు నీవు చెప్పులు ధరించటానికి ప్రయత్నించుగాని ప్రపంచమంతా ముండ్లు లేకుండా చేయటానికి ప్రయత్నించటము వెఱ్ఱితనము", అన్నాడట. ఒక రాజు కన్నులకు జబ్బు చేసింది. ఒక వైద్యుడు వచ్చి చెప్పాడుట, 'ఈ జబ్బు నివారణ కావాలంటే ఎక్కడ చూచినాగాని ఒకే green colour (ఆకుపచ్చ) వుంటే ఈ కన్నుల జబ్బు పోతుంది', అని అన్నాడుట! అంతే! paintersకి అంతా మంచి demand వచ్చేసింది. రాజుగారు అందరిని చెట్లకు గుట్టలకు, గోడలకు green colourని వేయమన్నారుట. ఒక మహనీయుడు రాజువద్దకు చేరి 'పిచ్చిరాజా! ఈ విధముగా రంగులు వేసుకుంటూ కూర్చుంటే యేమి ప్రయోజనము? నీ కన్నులకు green glasses వేసుకో. అంతా green గానే కనబడుతుంది', అన్నాడుట. అదేవిధముగానే మన హృదయాన్ని ప్రేమమయంగా మార్చుకుంటే యింక యితర వ్యక్తులను మనము ఏవిధముగాను దూషించనక్కరలేదు. భూషించనక్కరలేదు. తిరస్కరించనక్కరలేదు. కనుక, హృదయాన్ని కేవలము విషయాలతో నింపుకునే బదులు ప్రేమతో నింపుకోటానికి ప్రయత్నించండి. కేవలము పవిత్రమైన భావాలు పెంచుకోండి. ఏది చేసినప్పటికి స్వార్థరహితమైన పనిగా మనము చేయాలి. కృష్ణుడు చేసిన పని అదే! అనేక రాజులను జయించాడు, రాజకీయములలో ప్రవేశించాడు. అపమార్గములో పోయేవారిని అణగత్రొక్కాడు.

sri sathyasai vahini vachanamrutam

సరియైన అధికారికి అధికారము నందించాడు. ఎంత చేసినప్పటికి తాను మాత్రము కిరీటములేని రాజుగానే వుండిపోయాడు. కంసుని వధించిన తరువాత ప్రజలు వచ్చి కృష్ణుని ప్రార్థించినారు. "స్వామీ! ఈ మధురాపురిని తమరే పాలించవచ్చు కదా!" అని. అప్పుడు కృష్ణుడు "నేను King అయితే ఒక్కడనే అవుతాను. నేను King makerగా వుండాలి. రాజులను తయారుచేసేవానిగా వుండాలి. నాకు రాజ్యము అక్కరలేదు. హృదయ సామ్రాజ్యమును నేను పరిపాలిస్తున్నాను", అని. భగవంతుని భావములు యింత విశాలమైనవిగా యిట్టివిగా వుంటుంటాయి. ఈనాడు మన డ్రామాల్లో, సినిమాల్లో చూచి కృష్ణుడు చేసిన పనులు యిట్టివి అని మనము దీనిని ఆధారముగా చేసుకుంటున్నాము. ఒకరు కల్పించిన కథలివి. కానీ కృష్ణునిలో ఆ విధమైనవి లేవు.

**జీవులను బాధించి, దేవుని పూజిస్తే వచ్చే ఫలితమేముంది?**

దైవము ఒక్కడే! ఏ పేర్లు అయినా, ఏ దేశము అయినప్పటికి, ఏ కాలమైనప్పటికి దైవము ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించాలి. భేదభావములను మనము దూరము చేసుకోవాలి. అందరియందు దైవత్వము వున్నదనే సత్యమును గ్రహించాలి. ముఖ్యముగా ప్రకృతియొక్క ప్రభావమును మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ప్రకృతివేరు, పరమాత్మ వేరు కాదు. ఈ ప్రకృతికే ధర అని పేరు. ధర అనేటప్పుడు అదే రాధగా మారిపోయింది. రాధాకృష్ణుడు అనగానేమి? ప్రకృతి, పరమాత్మ స్వరూపమే రాధాకృష్ణ అని. ఈ ప్రకృతిలోపల మనము చేయవలసిన కర్తవ్యమును చక్కగా నిర్వర్తించటానికి ప్రయత్నంచేయండి. ఇదే నిజమైన ఆరాధన. కర్తవ్యమును విస్మరించి జీవులను బాధించి దేవుని పూజిస్తే వచ్చే ఫలితమేముంది? కనుక, జీవులను బాధించకుండా చూచుకోండి. చెప్పిన మాటలంతా విస్మరించటము, ధ్యానము, పూజలు చేయటము యేమాత్రము ప్రయోజనము లేదు. ఏదిచేసినా దైవకార్యముగానే భావించి చేయి, తప్పులేదు. కేవలము పూజ చేస్తేనే భక్తి కాదు. దేవాలయమునకు పోయినంత మాత్రమున భక్తి కాదు. మన దేహమే ఒక దేవాలయము. Body is a Temple of God. యీ temple యెలాంటిదంటే, ఇది ఒక చోట Permanent temple కాదు, Moving temple. ఈ దేహము ఎక్కడకు పోతుందో, ఈ దేవాలయము ఎక్కడ వుందో అక్కడంతా దేవుడున్నాడు. ఇది నడయాడే దేవాలయము. ఈ సత్యాన్ని మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. దేహానికి

srisathyasaivachanamrutam

యెన్నో రకములైన బాధలు సంభవిస్తూ వుంటాయి.

**పాంచ భౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో కూలక తప్పదెందు**
**శతవర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనంబున**
**బాల్యమందో మంచి ప్రాయమందో కాక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎరుకలేదు**

దేహము ఎప్పుడూ మార్పుచెందేటువంటిదే! ఇవన్నీ ఆహార విహారాదులతో వస్తుంటాయి, పోతుంటాయి. అలక్ష్యముతో మరికొన్ని ప్రమాదములు సంభవిస్తూ వుంటాయి. కనుక, ఈ దేహమును లక్ష్యపెట్టకుండా మనస్సు మరల్చటానికి ప్రయత్నించాలి. అదే పెద్ద ప్రబోధ! బాధ కలిగినప్పుడు 'అబ్బా! బాధనే! బాధనే!' అనుకుంటే ఈ బాధ మరింత అధికమవుతుంది. ఆ సమయమునందు యింకొక పనిపైన నీ మనస్సు మరల్చాలి. అదే నరసింహన్ వచ్చి చెప్పాడు.

## కాయమునకు కర్మాచరణమే ప్రధానమైన ధర్మము

దినమూ స్వామి కూర్చోటం సోఫాపైన, భోజనం చేయటం అక్కడే, పడుకోటం అక్కడే! కదలటమే లేదు. దీనికి rest ఎలావుంటుంది? Rest కావాలని doctors అంతా వచ్చి చెప్పారు. Rest అంటేయేమిటి? పరుపువేసుకొని, మంచిగా bed వేసుకొని, యింకో Pillow వేసుకొని చక్కగా సుఖముగా పండుకోటమా rest? అది కాదు, rest Change of work. పని మార్చటమే rest. అదీ నాపని. కొంతసేపు జాబులు చూస్తూవుంటాను, మరికొంతసేపు యింకోటి చూస్తాను. మరి నాపని నేను చేసుకుంటాను. బట్టలంతా చక్కగా మడతలు వేసుకొని పెట్టుకుంటాను. ఏదో ఒకపని చేస్తూ వుండాలి. ఇది కాయము; కర్మ నిమిత్తమై వచ్చినది. కనుక, కాయమునకు కర్మనాచరించటమే ప్రధానమైన ధర్మము. దీనితో యేదో ఒక పనిచేస్తూ వుండాలి. కర్మలు ఎందుకోసం చేయాలి? కాలమును సార్ధకము చేయటం కోసం! కాయము రావటము,

sri sathyasai vachanamrutam

కర్మకోసము; కర్మచేయటం కారణం కోసం! కాల, కర్మ, కారణ, కర్తవ్యాలే మానవుని ప్రధాన లక్ష్యములు. నాకు ఏ పనిలేకపోతే 'భక్తులు అక్కడ కూర్చున్నారు, యిక్కడ కూర్చున్నారు, వాళ్లు బాధపడుతున్నారు', అని ఈ విధముగా తలచుకుంటూ కూర్చుంటాను. అప్పుడు ఈ బాధ నాకు తెలియదు. కనుక, 'మనస్సును మరల్చటానికి చేసే సాధనే, సాధన' అన్నారు. మనస్సును మార్చుకోటంలోనే మనకు సర్వవిధములైన ఆనందము లభిస్తుంది. దీనినే 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. ఈ మనసే విష్ణు స్వరూపము. 'మనో మూల మిదం జగత్.' జగత్తంతా మనస్సుతోనే నిండివుంటున్నది. నీవు ఎప్పుడో హిమాలయములకు వెళ్లివచ్చావు. బదరీనాథ్, అమర్‌నాథ్, కేదార్‌నాథ్ అంతా పోయివచ్చావు. హిమాలయము యెంత పెద్ద స్వరూపము! కానీ నీవు యింటికి వచ్చిన తరువాత ఒక్కసారి కండ్లు మూసుకొని హిమాలయాన్ని చూడటానికి ప్రయత్నించు. ఆ హిమాలయము వచ్చి నీలో చేరిపోతుంది. నీ హృదయం చూస్తామా, చాలా చిన్నది. ఇంత పెద్ద హిమాలయము నీ హృదయంలో యేవిధముగా ఆవరించింది? కాబట్టి హృదయము చిన్నది కాదు. ప్రపంచమంతా హృదయముగా మారిపోయింది. కనుక, మనస్సంటే యేదో చిన్నదిగా మీరు భావించకండి. విష్ణు స్వరూపమైనదే మనస్సు.

### 'మనసులో నేను వున్నానుగాని, నాలో మనసు లేదు' అనే సత్యాన్ని గుర్తించాలి

విష్ణువు అనగా సర్వవ్యాపకమైనది. కనుక అలాంటి విష్ణుస్వరూపమైన మనస్సును మనం చిన్నదిగా భావించుకొని, దీనిని నిగ్రహించేదెట్లా? ఇది అక్కడికి పోతుంది, ఇక్కడికి పోతుంది అని అల్పముగా భావించటంచేతనే మనము ఈ అవస్థలకు గురౌతున్నాము. 'మనసులో నేను వున్నాను కానీ, నాలో మనసు లేదు', అనే సత్యాన్ని గుర్తించాలి. మనసంతాకూడను ప్రపంచములో యిమిడి వుంటుంది. ప్రపంచమంతా మనసులోనే వుంటుంది. దీనిని ప్రత్యేకమైన భావముగా మీరు తీసుకోకూడదు. స్వార్థము వున్నప్పుడు మనసు చిన్నదిగా మారిపోతుంది. దివ్యత్వముకూడను అల్పత్వముగా మారిపోతుంది. ఏదో మనం ఆశించటానికి పోతున్నాము, భగవంతుని వద్దకు. అలా యాచించటానికి నీవు యాచకుడు కాదు. You are the master. నీవు యజమానిగా ఉండాలి. 'నేను దేవునివాడను', అనుకోవాలి; 'దేవుడు నావాడు', అనుకోకూడదు. యివియే కృష్ణావతారములోని రెండు ప్రధాన సూత్రములు.

sri sathyasai vahini

యాదవులందరుకూడను అహంకారముచేత 'కృష్ణుడు మావాడు, మా బావమరిది, మా తమ్ముడు, మా సోదరుడు', అని అనేకరకాలుగా తమవాడుగా భావిస్తూ పోయారు. ఈ అహంకారము వుండినంతవరకును ఆత్మతత్త్వము యేమాత్రము అర్థం కాదు. కనుక యాదవులందరు హతమైపోయారు. గోపికలు అలాకాదు, 'కృష్ణా! మేము మీవారము. మేము మీవారము', అని కృష్ణునికి అంకితమైపోయారు. మేము మీవారమనుకోటంచేత కృష్ణుడు నిరంతరము వారివెంటే వున్నాడు. 'మేము మీవారముకానీ, మీరు మావారు కాదు.' మీరు మావారు అనుకున్నప్పుడు మీరువేరు, మేము వేరు అయిపోతాము. మేము నీవారమనుకుంటే నేను నీలో యేకమై పోతాను. నీవే అయిపోతాను. కనుకనే I, I అనేది వున్నప్పుడు You అనేది ఒకటి వస్తుంది. I+You అన్నప్పుడు WE అయిపోతుంది. ఇద్దరూ చేరినట్లుగానే వుంటుంది.

**ఈనాడు మనం చేసే సాధనలన్నీ మనస్సును అరికట్టుకోవటంకొరకు చేసే సాధనలే!**

ఈనాడు చేసే సర్వసాధనలు మనసును అరికట్టుకోటంకోసం చేసే సాధనలే! మనసులో చిన్న సూక్ష్మమైన గుణములంతా వుంటున్నాయి. మాటలపైన మనసు వుండినంతవరకు మనకు ఏమీ తోచదు. దేహముపైన ఏ చీమలు పారాడుతున్నాయో, ఇంకేమి అవుతుందో తెలీదు. యిక్కడేదో దురదగా వుందనుకుంటే దురద యేర్పడుతుంది. నీ మనస్సు దానిపైన పోవటంచేతనే అక్కడ దురదవస్తోంది. లేకపోతే దురద లేదక్కడ. అదేవిధంగా కష్టములుగాని, నష్టములుగాని, దుఃఖములుగాని, బాధలుగాని అన్నీ మన మనసుద్వారానే పుడుతున్నాయి. 'ఈ మనసు యెక్కడనుండి వస్తోంది? ఈ మనసు ఎవరు?' అనిచూస్తే యివి తలంపులుగానే వస్తున్నాయి. ఈ తలంపులెక్కడినుండి పుట్టాయి? మనము అనుకుంటాం. నాకు దుఃఖము వద్దు. ఆనందము కావాలి అనుకుంటాం. ఆనందము, దుఃఖము రెండూ ప్రత్యేకముగా లేవు. ఒకటి అంత్యమైతే మరొకటి ప్రారంభమవుతుంది.

**కష్టసుఖములు రెండును కలసియుండు**
**వాని విడదీయ నెవరికి వశము కాదు**
**సుఖము ప్రత్యేకముగ నెందు చూడబోము**
**కష్టము ఫలించెనేని సుఖం బటంద్రు**



srisathyasaivachanamrutam

కనుక మనము కష్టాన్నికాని, సుఖమునుగాని రెండింటిని చింతించకుండా, రెండింటికి జన్మస్థానమైనదానిని చింతించాలి.

ప్రేమస్వరూపులారా! ముఖ్యముగా మనము ఆకారములపైన శ్రద్ధ వహించకూడదు. గట్టిగా వుండిన పువ్వు విచ్చినప్పుడే సుగంధము ఆనందమును యిస్తుంది. పుష్పము పుష్టిగా వుండాలి. పుష్టిగా వున్నప్పుడు విచ్చినప్పుడే అందము, ఆనందము లభిస్తుంది. పుష్పము పుష్టిగా లేకపోతే ఆ పుష్పము అందముగా వుండదు. దాని పరిమళముకూడను అంత ఘాటుగా వుండదు. కనుక పుష్పము పుష్టిగా వుండాలంటే మన గుణములు మంచివిగా వుండాలి. గుణములు మంచిగా వున్నప్పుడే ప్రపంచమంతా మనలనాకర్షిస్తుంది. దేహముపైనే మనము లక్ష్యాన్ని పెట్టుకుంటే యిది తాత్కాలికమైన ఆనందాన్ని యిస్తుంది. కృష్ణుని రూపాన్ని చూచి ఆనందించినది రాధయొక్క చెల్లెలు, చంద్రకళ. రూపాన్ని ఆధారము చేసుకుంది చంద్ర. గుణమును ఆధారముగా తీసుకుంది రాధ. గుణములు ఆధారముగా తీసుకున్నది కనుకనే జీవిత ఆనందము అనుభవించింది. ఆ గుణములనే చింతిస్తూ వచ్చింది. ఆ రాధకు నిరంతరము కృష్ణారాధనే! అనేకమందికి తెలుసును RADA. R నుండి ప్రారంభమైన రాధ అయింది. A నుండి ప్రారంభమైనప్పుడు ఆధార్ అయింది. D నుండి ప్రారంభమైనప్పుడు ధార్ అయిపోయింది. A నుండి ప్రారంభమైనప్పుడు ఆరాధ్ అయిపోయింది. అనగా రాధకు ఆధారము ధార! 'ఆరాధనే రాధ' అన్నారు. ఎవరు ఆరాధన చేస్తే వారంతా రాధనే! ఇలాంటి దివ్యతత్త్వాన్ని భాగవతములో అనేక విధములుగా గోపికలకు, గోపాలురకు బోధించి తనయొక్క ప్రేమతత్త్వములోపల దివ్యత్వాన్ని అనుభవింపచేశాడు కృష్ణుడు. అతని లీలలన్నీ అనంతమైనవి, అగమ్యమైనవి, వర్ణించుటకు సాధ్యము కానివి. కానీ, తుచ్ఛమైన భావములచేత గోపికలయొక్క తత్త్వము, కృష్ణునియొక్క చేష్టలు యివన్నీ కూడను కొన్ని విరుద్ధమైన భావములతో అనుభవింపచేస్తూ జగత్తునకు ఒక అపప్రచారము చేసుకుంటూ పోయారు కొందరు. కట్టకడపటికి తేలిన అంతరార్థము యేమిటి? హృదయమే బృందావనము. మన భావములే గోపికలు. ఆత్మయే కృష్ణుడు. ఆనందమే లీలలు. ఇదే నిజమైన హృదయ బృందావనము. ప్రతి మానవునియొక్క హృదయము బృందావనముగా మార్చుకోవాలి. ఆత్మస్వరూపునే కృష్ణునిగా తీసుకోవాలి. నీవు చేసే ప్రతిపని కూడను ఆ గోపికా కృష్ణుని లీలలుగానే భావించాలి.

sri sathyasai vachanamrutam

## భగవన్నామమే నిజమైన మాధుర్యమును అందిస్తుంది

ఈనాడు గోకులాష్టమి అనుకుంటే కేవలము కృష్ణుని పుట్టినదినమునే ప్రధానముగా తీసుకొని దానికిగాను పాయసము, పరమాన్నము తినేసి మనం గోకులాష్టమి గడపుకున్నామంటే అది సరి కాదు. పరమాన్నమంటే యేమిటి? చక్కెరవేసి, బియ్యమువేసి, సగ్గుబియ్యంవేసి పరమాన్నము చేయటంకాదు. 'పరమునకు సంబంధించిన అన్నము, పరమాన్నము' అన్నారు. పరమాన్నము తియ్యగా వుంటుంది. పరము యెంతయిదిగా వుంటుందంటే తియ్యగా వుండాలి. మధురమైన ప్రేమగా వుంటుండాలి. ఆ పరమాన్నమే కృష్ణనామము. భగవన్నామమే నిజమైన మాధుర్యము

**వచనం మధురం నేత్రం మధురం**
**గాత్రం మధురం సర్వం మధురం**
**మధురాతిపతే మధురం మధురం**

కనుక మనము దైవమును విస్మరించకుండా త్యాగమును, ప్రేమ భావమును పెంచుకొని, సర్వులు భగవంతునియొక్క అంశములే అనే సత్యాన్ని గుర్తించటము అత్యవసరము. ప్రేమను నేర్పే నిమిత్తమై పరమాత్ముడు వచ్చినాడనే సత్యమును మనము విశ్వసించాలి. మన ప్రేమ చాలా సంకుచితముగా వుంటున్నాది. స్వార్థమైనదిగా వుంటున్నాది. ఇదికాదు, నిజమైన ప్రేమ. అందరియందు వుండిన ప్రేమ తత్త్వాన్ని అర్థము చేసుకొనే ప్రేమను మనము పెంచుకోవాలి. మతము, మతమని చిలుక పలుకులు పలుకుతున్నారేగాని, నిజముగా ఆ మతముయొక్క ఆశయాన్ని ఎవరైనా ఈనాడు అనుభవిస్తున్నారా? ఈనాడు వాచా వేదాంతము అధికమైపోతున్నది గాని, ఆచరణ వేదాంతము శూన్యమైపోతున్నాది. మనకు ఆచరణ వేదాంతము కావాలి. నీవు నూరు చెప్పేదానికంటె, ఒక్కటి చేసి చూపిస్తే చాలు. ప్రేమతత్త్వాన్ని పెంచుకుని, భగవన్నామములో వున్న మాధుర్యమును అనుభవించండి!

**(తేదీ. 03-09-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam